'ప్రజా సేవలో తరిమెల నాగిరెడ్డి' పుస్తక పరిచయం



భారత విప్లవోద్యమ మహానాయకులలో ఒకరైన కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి శతజయంతి సంవత్సరం జరుగుతోంది. శతజయంతి ప్రారంభ సందర్భంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఆయన జన్మదినమైన ఫిబ్రవరి 11న పార్టీశ్రేణులు, విప్లవోద్యమ అభిమానులు కార్యకర్తలు ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు మరియు తరిమెల నాగిరెడ్డి స్మారక సంఘాల ఆధ్వర్యంలో హైద్రాబాద్‌లో కామ్రేడ్ టి.ఎన్. శతజయంతి సంవత్సర ప్రారంభసభ జరిగింది.

తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ కమిటి ఆధ్వర్యంలో చెరుకూరి సత్యనారాయణ సంపాదకత్వంలో 'ప్రజాసేవలో తరిమెల నాగిరెడ్డి' అనే 520 పేజీల పుస్తకాన్ని హైదరాబాద్‌లో జరిగిన ఈ శతజయంతి ప్రారంభసభలో విశ్రాంత ఐఏఎస్ అధికారి, ప్రజాతంత్ర మేధావి కె.ఆర్. వేణుగోపాల్ ఆవిష్కరించారు.

కామ్రేడ్ టి.ఎన్.తో సన్నిహిత సంబంధాలలో కొనసాగిన మిత్రులు, ఉద్యమ సహచరులు, ఆయన వ్యక్తిత్వాన్ని, రాజకీయాలను, ఆచరణను దగ్గరగా పరిశీలించి ప్రభావితులైన ప్రజాతంత్రవాదులు, మేధావులు, తమ జ్ఞాపకాలను, అనుభవాలను, తాము పొందిన స్ఫూర్తిదాయక అంశాలను తమ తమ వ్యాసాలలో పేర్కొన్నారు. కొద్దిపాటి పరిచయాలతోటి కూడా తమపై కా॥ టి.ఎన్. ప్రగాఢ ప్రభావం ఏవిధంగా వేయగలిగారో మరికొందరు గుర్తుచేసుకున్నారు.

అధికార మార్పిడి అనంతర భారత రాజకీయ ఆర్థిక వ్యవస్థపై కామ్రేడ్ టి.ఎన్. చేసిన లోతైన మార్క్సిస్టు విశ్లేషణ, 'తాకట్టులో భారతదేశం'గా పేరెన్నికగన్న ఆయన కోర్టు ప్రకటన; 1969 మార్చిలో అసెంబ్లీ సభ్యత్వానికి రాజీనామా చేస్తూ కామ్రేడ్ టి.ఎన్. చేసిన చారిత్రాత్మక ప్రకటన; స్వీడన్ విలేఖరులైన లీసాబర్గ్, లాసాబెర్గ్‌లకు ఆయన ఇచ్చిన రాజకీయ ప్రాధాన్యత కల్గిన ఇంటర్వ్యూ మొదలైనవన్నీ ఇప్పటికే తెలుగుతోపాటు వివిధ భాషలలోకి అనువదింపబడి ప్రాచుర్యం పొందాయి.

'ప్రజాసేవలో తరిమెల నాగిరెడ్డి' పుస్తకంలో పై ఇంటర్వ్యూలలో కొన్నిటిని పొందుపరిచారు. ఈ పుస్తకంలో కా॥ టి.ఎన్.తో గతకాలపు జ్ఞాపకాలను నెమరువేసుకున్నవారు కొందరైతే, ఆ ప్రభావంతో కమ్యూనిస్టు, ప్రగతిశీల ఉద్యమాలకు ఈనాటికీ తోడ్పాటునందిస్తున్నవారు, వివిధ రాజకీయ దృక్పథాలతో పనిచేస్తున్నవారు వున్నారు. అలాగే ఆనాటినుండి కామ్రేడ్ టి.ఎన్.తో ఉద్యమంలో కలిసి కొనసాగి, ఆ సిద్ధాంత రాజకీయ వారసత్వాన్ని కొనసాగిస్తూ ఉద్యమాలలో ఎన్నో కష్టనష్టాలను, నిర్బంధాలను, అవమానాలను తట్టుకుంటూ నిలకడగా కొనసాగుతూ వున్నవారూ వున్నారు.

తన జీవితమంతా అహరహం ప్రజల కోసం తపించి, విప్లవోద్యమానికి జీవితాన్ని కరిగించి అర్పించిన మహోన్నత నాయకుడు కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి. సిపిఐ(ఎం-ఎల్) ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ విశ్వం ఈ పుస్తకంలో రాసిన ఓ వ్యాసం ముగింపులో పేర్కొన్నట్లుగా "ఆయనలో (టి.ఎన్.లో) పైకి కనబడే సాదా సీదా తత్వం, ఆందోళనాతత్వం మాత్రమే చూచినవారు వారి వైఖరిని సరిచేసుకోవాలి. ఆయన తనను తాను కష్టపెట్టుకున్నాడు. కఠినాత్ముడు నాగిరెడ్డి! దేనికోసం ఈ కాఠిన్యం? విప్లవం కోసమే. ఆయన్ను ద్వేషించవద్దు.... ప్రేమించవద్దు.... ఆయన్ను ఆచరించండి..... ఇది నా విజ్ఞప్తి" అనేది ఎల్లప్పుడూ గమనంలో ఉంచుకోవలసిన ముఖ్యమైన అంశం. తరిమెల నాగిరెడ్డి శతజయంతి సందర్భంగా తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు, తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ కమిటీలు సమన్వయంతో ఈ సంవత్సర కాలమంతా మరిన్ని సభలు, సమావేశాలు నిర్వహించటం మరింత సాహిత్యం ప్రచురించటంతో పాటు కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి రాజకీయ, సిద్ధాంత పుస్తకాలను మరోసారి విస్తృతంగా ప్రజల మధ్యకు, మధ్యతరగతి బుద్ధిజీవులు, మేధావుల మధ్యకు తీసుకువెళ్ళటం అవసరం.

oooooooo